సాక్షి
సంగారెడ్డి



దూర విద్యకు టాస్

చదువుపై ఆసక్తి ఉన్నా ముందుకు సాగలేక పోతున్న వారికి టాస్ మంచి అవకాశం కల్పిస్తుంది. వివరాలు 8లో ▸



సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అందోల్–జోగిపేట ఆర్డీఓ పాండు సూచించారు. వివరాలు 9లో ▸



ఆగిన పనులు..

జహీరాబాద్‌లో నిర్మిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం నిధుల కొరతతో అసంపూర్తిగా ఆగిపోయింది. వివరాలు 9లో ▸

శనివారం । 31 । ఆగస్టు । 2024

న్యూస్‌రీల్

ఖేడ్‌లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు

నారాయణఖేడ్: పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో శ్రావణమాసంలో నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. పూజా సామగ్రిని ఆలయ తరఫునే అందజేశారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని వ్రతాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మలమంచి మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో అమ్మవారికి తామర పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

పింఛను మంజూరు పత్రాలు అందజేత



పింఛన్ పత్రాలను అందజేస్తున్న భవిష్యనిధి కమిషనర్

పటాన్‌చెరు టౌన్: ప్రతీ నెల ప్రయాస్ పథకంలో భాగంగా పదవీ విరమణ పొందిన నెలలోనే చందాదారులకు పింఛన్ పత్రాలను మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల అగర్వాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఆగస్టు నెలలో పదవీ విరమణ పొందిన 38 మంది చందాదారులకు పత్రాలు రెడీ చేసి అందులో 9 మందికి కార్యాలయంలో అందజేశారు.కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్ 2 శ్రీదేవి, అకౌంట్స్ ఆఫీసర్ రవిచంద్ర పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడా పోటీలను జ్యోతిప్రజ్వల చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి రెండురోజుల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దౌల్తాబాద్ హత్నూరలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్ నరసింహగౌడ్, రాష్ట్ర లేబర్ కమిషన్ మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింలు, కౌన్యాల వెంకటేశం పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

సంగారెడ్డి: అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో రుణమాఫీ కానీ రైతులతో ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రవీణ, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

జహీరాబాద్: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన కోల్ ఇండియా లిమిటెడ్ ఆర్థిక సాయంతో మహిళలకు ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్‌సరీ ్వసెస్ ఆధ్వర్యంలో జిల్లాలోని అర్హులైన మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు నెలల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తిగలవారు vikarap2013 @fmai.com మెయిల్ ద్వారా దరఖాస్తులు పంపించాలని కోరారు. లేదా సంఘమిత్ర పాఠశాల వద్ద గల సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

2న ఎంపిక పోటీలు

వర్గల్(గజ్వేల్): రాష్ట్రస్థాయి బేస్‌బాల్ బాలబాలికల పోటీల కోసం జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మ రంగారెడ్డి, మధుయాదవ్ తెలిపారు. క్రీడాకారుల ఎంపిక కోసం సెప్టెంబర్ 2న ప్రజ్ఞాపూర్ సెయింట్‌మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం 10 గంటలోగా హాజరుకావాలని సూచించారు. వివరాల కోసం 98489 49152, 79819 23779 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హైడ్రా హడల్

స్థానిక అధికారుల గుండెల్లో గుబుల్

హైడ్రా అధికారులు హడలెత్తిస్తున్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని ఫిర్యాదు చేస్తే చాలు అక్కడ వాలిపోతున్నారు. ముందుకు వెనుక చూసుకోకుండా కూల్చివేస్తున్నారు. హైడ్రా దూకుడుతో ఆక్రమణ దారులు, అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నెల రోజులుగా చెరువులు, కుంటల ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై అధికారులు విరుచుకు పడుతున్నారు. దీంతో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కబ్జాదారులకు కంటికి కునుకులేకుండా పోతుంది. ఎప్పుడు ఈ ప్రాంతంలో అడుగు పెడతారోనని వణికిపోతున్నారు. స్థానిక అధికారులు కొందరు ఇప్పటికే అప్రమత్తమై చిన్న చిన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం మొదలు పెట్టారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు):

- తెల్లాపూర్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన
- హైడ్రా అడుగు పెట్టక ముందే అప్రమత్తం
- స్థలాల చుట్టూ రేకుల కూల్చివేత

రింగ్ రోడ్డు పుణ్యమంటూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ ప్రాంతంలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. సంపన్న వర్గాలు ఈ ప్రాంతంలో నివాసం ఉండేదుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఇక్కడ రియల్ వ్యాపారం జోరుగా సాగుతుంది. దీంతో రియల్ వ్యాపారుల కన్ను చెరువులు, కుంటలు, వరద కాలువలపై పడింది. అధికారుల అండదండలతో దర్జాగా వాటిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై అనేక ఏళ్లుగా స్థానికులు ఆందోళనలు చేపడుతున్నారు. అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం హైడ్రా అడుగుపెట్టడంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నిర్మాణదారులు అన్ని శాఖలకు సంబంధించిన అనుమతులు, ఎన్‌ఓసీలు తీసుకొని నిర్మాణ పనులు ప్రారంభించామని చెబుతున్నారు. అధికారులు నిబంధనలు పాటించి ఉంటే ప్రస్తుతం హైడ్రా అధికారులకు ఇక్కడికి వచ్చే వారే కాదని స్థానికులు వాపోతున్నారు. హైడ్రా విచారణలో అక్రమ నిర్మాణాలు అని తెలితే వాటిని కూల్చివేసి, వారికి అండగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకొని అవకాశం ఉందని స్థానికంగా జోరుగా చర్చ నడుస్తుంది.



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

అనుమతులు ఉన్నాయా?

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, వరద కాలువలను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నా వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో వచ్చి చూసిన పాపానపోలేదు. స్థానికులు అధికారులను ప్రశ్నిస్తే వారికి అని అనుమతులున్నాయని సమాధానం చెప్పేవారని పలువురు చెబుతున్నారు. ఎవరైన ఫిర్యాదు చేస్తే నామామాత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకునేవారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ధైర్యం చేసి అక్కడికి వెళితే పెద్దల నుంచి ఒత్తిడిలు వచ్చేవని తెలుస్తుంది.

కొనుగోలుదారుల పరిస్థితి ఏమిటి?

ఎఫ్‌టీఎల్, వరద కాలువలను ఆక్రమించి నిర్మించిన ఇళ్లను కొనుగోలు చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అనేక మంది అనుమతులను చూసి ఈ ప్రాంతంలో ప్లాట్లు, ఇళ్లను కొనుగోలు చేశారు. ఒకవేళ తమ విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే తమ పరిస్థితి ఏమిటని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో చెరువు భూమిలో ఇళ్లను నిర్మించారని రాత్రికిరాత్రి పెద్దపెద్ద భవనాలను అధికారులు కూల్చివేశారని, ఇప్పుడు అదే జరుగుతుందా అని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా..

గత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రస్తుతం పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు. గతంలోనే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో నిర్మాణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటే మాకు ఈ ఇబ్బంది ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా ఎక్కడ వచ్చి తమపై చర్యలు తీసుకుంటుందోనని స్థానిక అధికారులు కూడా భయపడుతున్నారు. పలుచోట్ల నిర్మాణాలను వదిలి స్థలాల చుట్టూ ఉన్న రేకులను కూల్చివేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్లు ప్రచారం చేసుకోవడం శోచనీయం.

పటాన్‌చెరుకు నేడు హైడ్రా బృందం

పటాన్‌చెరు : పటాన్‌చెరు నియోజకవర్గంలో శనివారం హైడ్రా బృందం పర్యటించనుంది. పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాల పరిధిలోని చెరువులు, కుంటల్లో జరిగిన కబ్జాలపై ఆరా తీయనుంది. ఈ మేరకు స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ జీహెచ్‌ఎంసీ శాఖల అధికారులు రికార్డులను సిద్ధం చేసుకోవాలని 'హైడ్రా' సూచించినట్లు తెలిసింది. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువుతో పాటు పటాన్‌చెరు, తెల్లాపూర్ రామచంద్రాపురం పరిధిలోని చెరువుల ఆక్రమణలను హైడ్రా ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు. ఇప్పటికే కబ్జాకు గురైన చెరువుల విస్తీర్ణంపై ప్రాథమికంగా హైడ్రాకు నివేదిక సమర్పించారు. ఇప్పటికే హైడ్రా కమిషనర్ రంగనాథ్ అమీన్‌పూర్ పెద్ద చెరువు, బందం కొమ్ము చెరువును రెండుసార్లు పరిశీలించారు. ఆక్రమణలపై స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా, రెండు రోజుల క్రితం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారితో నిర్వహించిన కలెక్టర్ల సమావేశానికి కలెక్టర్ క్రాంతి కూడా హాజరైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిబంధనల మేరకు ముందుకు వెళ్లాలని చీఫ్ సెక్రటరీ ఆదేశించారు. హైడ్రా క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అక్రమార్కులకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని చర్చ సాగుతోంది.

అనేక మార్లు ఫిర్యాదు చేశాం



చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణం జరిగే సమయంలోనే అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. వారు నామామాత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి.

– వడ్డే నర్సింహ, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత



చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత. ఇందుకోసం గతంలోనే గ్రీన్‌ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాం. చెరువులు, వరద కాలువలు రక్షణకు హైడ్రా కృషి చేయడం హర్షనీయం.

– కొల్లూరి భరత్, కౌన్సిలర్, తెల్లాపూర్

మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద బస్టాప్

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్‌లోని మియాపూర్ మెట్రో రైల్వే స్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆగుతాయని జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్ హుసేన్ తెలిపారు. మెట్రో రైళ్లలో రాకపోకలు సాగించే వారు మియాపూర్ వద్ద బస్టాప్‌లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మెట్రో రైళ్లలో ప్రయాణించేందుకు జిల్లా ప్రజలు లింగంపల్లి బస్‌స్టాప్ వద్ద దిగి... అక్కడి నుంచి ఆటో, సిటీ బస్సులో మియాపూర్ మెట్రో స్టేషన్‌కు వెళ్లాల్సివస్తుంది. ఈ ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద బస్టాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో జహీరాబాద్‌తో పాటు నారాయణఖేడ్, సంగారెడ్డి తదితర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయని చెప్పారు.

20రోజులుగా 'భగీరథ' నీరు బంద్

జహీరాబాద్ టౌన్ : మొగుడంపల్లి మండలం గౌసాబాద్ గ్రామంలో 20 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నెల రోజుల క్రితం గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా గురించి సంబంధిత శాఖ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. నీటి సరఫరా వివరాలు నమోదు చేసుకున్నారు. సర్వే చేసిన కొన్ని రోజులకే నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలోని బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామి చెప్పారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

స్పాట్ కౌన్సెలింగ్

కంది(సంగారెడ్డి) : ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్) కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద మిగిలిన సీట్ల స్పాట్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయంలో వచ్చే నెల 2న ఉదయం 10:30 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు టీజీ ఎప్‌సెట్ 2024లో అర్హత సాధించిన ఎంపీసీ విద్యార్థులు లేదా ఇంటర్ తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారుకూడా హాజరు కావచ్చని వివరించారు. ఇతర వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

ఎస్సీ, ఎస్టీలను వేధిస్తే కఠిన చర్యలు

కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

సంగారెడ్డి జోన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీకి చెందిన అన్ని రకాల కేసులు సెప్టెంబర్ చివరి వరకు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పోలీసు, రెవెన్యూ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వారిని అనవసర కేసుల్లో ఇరికించవద్దని తెలిపారు. వేధింపులకు గురి చేస్తే కమిషన్ తరఫున కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి, మెనూ ప్రకారం భోజనం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలను విధిగా నిరంతరం తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. భూ సమస్యలపై ఆర్డీఓల ద్వారా న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, నీలాదేవి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా అధికారులు అఖిలేష్ రెడ్డి పాల్గొన్నారు.

చట్టం పటిష్టంగా అమలు చేయాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు కేవీపీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, సహాయ కార్యదర్శి దాసు, మహేష్ పాల్గొన్నారు.

ఇస్నాపూర్ గురుకులంలో..

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరిశీలించారు. వంటశాలలో వండిన ఆహారాన్ని పరిశీలించారు. బోధన, వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

– ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: సంక్షేమ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులతో సహపంక్తి భోజనాలు, రాత్రినిద్ర నిర్వహిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఖేడ్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గస్థాయి హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో ఏర్పాటు చేసిన అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలస్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు కూడా వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు, రాత్రి నిద్ర నిర్వహించాలని సూచించారు. హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. వారికి నాణ్యమైన భోజనం అందించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ మెస్ చార్జీలు పెంచే ఆలోచనలో ఉందని అన్నారు. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో ఏఎస్‌డబ్ల్యూఓ చంద శ్రీనివాస్, ఎంపీడీవోలు శ్రీనివాస్‌రెడ్డి, వివేకానంద్, సీడీసీ చైర్మన్ షాదుల్, బంజారా సేవాలాల్ సంఘం అధ్యక్షులు రమేష్ చౌహాన్, హాస్టల్ వెల్ఫేయిర్ అధికారులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు నిరంతర గస్తీ

ఎస్పీ చెన్నూరి రూపేష్



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి జోన్: జిల్లాలోని మహిళల భద్రతకు భరోసా, షీ టీమ్స్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ చెన్నూరు రూపేష్ ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఎన్‌బీడబ్ల్యు ఎక్స్‌క్యూషన్, మహిళల భద్రతపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యు(నాన్ బెయిలబుల్ వారెంట్స్)లు ఎక్స్‌క్యూషన్ కోసం సబ్ డివిజన్ల వారీగా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సబ్ డివిజన్లలో షీటీమ్స్ బృందాలు బస్టాండ్లు, కళాశాలలు, పాఠశాల ఆవరణలో నిరంతరం గస్తీ ఏర్పాటు చేసి ఆకతాయిలకు చెక్ పెట్టాలన్నారు. భరోసా, షీ టీమ్స్ ఆన్‌లైన్ మోసాలపై, ఆన్ సేఫ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ సంజీవరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్పీ ఎస్ఐ యాదవరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్లను సస్పెండ్ చేయాలి

డీఆర్వోకు సీపీఐ నాయకుల వినతి



డీఆర్వో పద్మజారాణికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ కమిషనర్లను తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెహమాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదాశివపేట మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి పర్యవేక్షణలో జరిగిన పట్టణ గణేష్ నవరాత్రుల ఉత్సవ సమావేశంలో చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్ స్థానంలో ఆమె భర్త శివరాజ్ పాటిల్ కూర్చోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించిన మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. అదేవిధంగా సంగారెడ్డి పట్టణంలో కుక్కల టీకా నిధులు పక్కదారి పట్టించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్, సమద్, మహ్మద్ అక్బర్, మహ్మద్ కలీం, పట్నం శీను, మహమ్మద్ జమీల్, పాముల రమేష్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



రోగులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

జోగిపేట (అందోల్): డెంగీ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ గాయత్రీ దేవి సూచించారు. శుక్రవారం ఆమె జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. డెంగీ, ఇతర జ్వరాల బారిన పడిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. డ్యూటీ డాక్టర్లు, స్టాఫ్ రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆస్పత్రిలో మొత్తం 20 కేసులు ఉన్నాయని, అందులో మూడు డెంగీ కేసులుగా నిర్ధారణ అయ్యి చికిత్సలు పొందుతున్నారని తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రులలో మందుల కొరత లేదన్నారు. డాక్టర్ నాగలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఎండైనా.. వానైనా.. 'ఓపి'క పట్టాల్సిందే..





వర్షం చినుకులలో తడుస్తూనే ఓపీ చీటి కోసం క్యూలో నిల్చున్న మహిళలు



సంగారెడ్డి పట్టణం ఇందిరా కాలనీలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



సంగారెడ్డి పట్టణం ఇందిరా కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం వందల మంది వైద్యం కోసం వస్తుంటారు. అందులో గర్భిణులు, బాలింతలు కూడా ఉంటారు. అయితే వారు ఓపీ చీటి పొందాలంటే ఆస్పత్రి ఆరుబయట నిలబడాలి. ఎండ కొట్టినా.. వర్షం పడినా కిటికీ నుంచి చీటి తీసుకోవాలి. శుక్రవారం ఉదయం కూడా ఓపీ చీటి కోసం చినుకులు పడుతున్నా మహిళలు ఆరుబయట లైన్‌లో నిలబడ్డారు. కనీసం వర్షం పడినప్పుడైనా ఆరోగ్య కేంద్రం లోపల చీటిలు ఇవ్వాలని కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి జోన్: భూమి పట్టా మార్పిడిలో అన్యాయం చేసిన మొగుడంపల్లి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని మన్నాపూర్ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన్నాపూర్ గ్రామానికి చెందిన పారమ్మకు 3ఎకరాల 33 గుంటల భూమి ఉందన్నారు. భర్త సిద్ధారెడ్డి చాలా ఏళ్ల క్రితం చనిపోగా, ఇటీవల పారమ్మ కూడా చనిపోయిందని తెలిపారు. ఆమె పేరుపై ఉన్న భూమిని సరైన హక్కుదారులకు మార్పిడి చేయలేదని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో తహసీల్దార్‌కు కూడా సమాచారం అందించామని, అయినప్పటికీ ఇతర వ్యక్తులకు భూమి మార్పిడి చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను నిలదీయగా, సరైన పత్రాల ఆధారంగానే రిజిస్ట్రేషన్ చేశానని చెప్పారన్నారు. అందుకు సంబంధించిన జిరాక్స్ పత్రాలు అడిగితే ఇవ్వడంలేదన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సెప్టెంబర్ 2,3,4 తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ పోటీలకు, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ తెలిపారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినీలు లక్ష్మీవైష్ణవి, అర్చనలను శుక్రవారం స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతాదేవి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీదేవి, రాజ్‌కుమార్, రాజ్ మోహన్ గౌడ్, జ్యోత్స్న, బాలవాణి, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట నుంచి 10 మంది..

సిద్దిపేటజోన్: జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా జట్టు సభ్యులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన సెలక్షన్ ప్రక్రియకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–14 సబ్ జూనియర్ టెన్నీకాయిట్ బాల బాలికల జట్టుకు 10 మందిని ఎంపిక చేశారు. వీరంతా సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

పురాతన పార్శ్వనాథుడి విగ్రహం అపహరణ

టేక్మాల్(మెదక్): జైన మత పార్శ్వనాథ తీర్థంకర విగ్రహం అపహరణకు గురైన ఘటన టేక్మాల్ మండలంలోని వేల్పుగొండ గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్‌ఐ దయానంద్ కథనం మేరకు... గ్రామంలోని పెద్ద చెరువు మధ్యలో గల దేవతల గుట్టలో చారిత్రక వారసత్వ సంపద కలిగిన జైనమత పార్శ్వనాథుడి విగ్రహం కొలువై ఉంది. ఈ విగ్రహాన్ని జూలై 15వ తేదీన సూరంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి బ్రహ్మయ్య చివరిసారిగా చూశాడు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో అదే గ్రామానికి చెందిన తాండూరి సాయిలు మేకలను మేపుతూ దేవతల గుట్ట పైకి వెళ్లాడు. గుట్టపై విగ్రహం లేకపోవడంతో విషయాన్ని గ్రామస్తులకు తెలిపాడు. చారిత్రక సంపద కలిగిన విగ్రహం అపహరణకు గురైందని వేల్పుగొండ గ్రామానికి చెందిన బోయిని నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

అరుదైన ఆపరేషన్

మహిళ కడుపులోంచి 4 కిలోల ఫైబ్రాడ్ గడ్డ, గర్భసంచి తొలగింపు



లక్ష్మీతో హేమరాజ్‌సింగ్, వైద్య సిబ్బంది

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి వైద్యులు మరో అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణానికి చెందిన కంచర్ల లక్ష్మీ కొద్ది రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ పలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లినా తగ్గలేదు. దుబ్బాక ఆస్పత్రికి తీవ్ర అస్వస్థతతో రాగా వైద్యులు పరీక్షలు నిర్వహించి అత్యవసరంగా ఆపరేషన్ అవసరం ఉందని గుర్తించారు. డాక్టర్ హేమరాజు సింగ్ ఆధ్వర్యంలో లక్ష్మీకి వైద్యులు ఆపరేషన్ చేసి ఆమె కడుపులోంచి 4 కిలోల ఫైబ్రాడ్ గడ్డతోపాటు గర్భసంచిని తొలగించారు. ప్రస్తుతం లక్ష్మీ ఆరోగ్యం నిలకడగా ఉంది. లక్ష్మీ ప్రాణాలు కాపాడిన డాక్టర్ హేమరాజ్‌సింగ్‌తోపాటు వైద్య సిబ్బందిని ఆమె కుటుంబీకులు అభినందించారు.

దూర విద్యకు టాస్

డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో టెన్త్, ఇంటర్ విద్యాభ్యాసం

- ఉమ్మడి జిల్లాలో 95 కేంద్రాలు
- తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ నుంచి అవకాశం
- వచ్చేనెల 10 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రెగ్యులర్ విద్యతో సమానంగా సర్టిఫికెట్



ఆర్సీపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఓపెన్ స్కూల్ విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

పేదరికం, కుటుంబ ఆర్థిక సమస్యలు, తదితర కారణాలతో ఎంతో మంది పాఠశాల స్థాయిలోనే చదువులు ఆపేస్తుంటారు. మరికొందరు పదో తరగతి పూర్తయినా.. వివిధ కారణాలతో ఇంటర్‌లోనే ఆపేస్తారు. చదువుపై ఆసక్తి ఉన్నా అనేక కారణాలతో ముందుకు సాగలేక మదనపడుతుంటారు. ఇలాంటి వారు సులువుగా విద్యాభ్యాసం చేసేందుకు టాస్ (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) మంచి అవకాశం కల్పిస్తుంది. సులభమైన విద్యా విధానంతో పది, ఇంటర్ చదివే వారి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

– మెదక్ కలెక్టరేట్

2008–09లో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతితో దూర విద్యను అందుబాటులోకి తెచ్చింది. అభ్యాసకుల నుంచి మంచి స్పందన రావడంతో 2010–11లో ఇంటర్మీడియట్‌ను ప్రారంభించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మెదక్(17), సంగారెడ్డి(48), సిద్దిపేట(32) చొప్పున మొత్తం 95 స్టడీ సెంటర్లు ఉన్నాయి. సులభమైన విద్యావిధానంతో పది, ఇంటర్ తరగతులు పూర్తి చేయొచ్చు. ఎంపిక చేసిన మండలాల్లో ఒక పాఠశాలలో తరగతులు నిర్వహిస్తుంటారు. అక్కడి ప్రధానోపాధ్యాయుడు మండల సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకుంటున్నారు. ప్రతీ సంవత్సరం వేల సంఖ్యలో పదవ తరగతి, ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నారు. ఇవి పూర్తి చేసిన వారికి రెగ్యులర్ విద్యతో సమానంగా గుర్తింపు సర్టిఫికెట్‌ను అందజేస్తారు.

పదిలో...

పదో తరగతి బోధన విషయంలో మూడు గ్రూపులుగా విభజించారు. ఇందులో గ్రూపు–ఏలో భాషలు, గ్రూపు–బీలో ప్రధాన పాఠ్యాంశాలు, గ్రూపు–సీలో వృత్తి విద్యా కోర్సులు ఉంటాయి. గ్రూప్–ఏ, బీల నుంచి కనీసం రెండు సబ్జెక్ట్‌ల చొప్పున మొత్తం 5 సబ్జెక్ట్‌లు ఎంపిక చేసుకోవాలి.

మూడేళ్ల ఉత్తీర్ణత శాతాలు

విద్యా సంవత్సరం	పదో తరగతి	ఉత్తీర్ణత	ఇంటర్	ఉత్తీర్ణత
2021-22	3,112	70.85	4,219	49.60
2022-23	3,116	70.12	5,588	59.02
2023-24	3,408	71.04	5,960	60.72

అర్హులు ఎవరంటే..

పదవ తరగతిలో అడ్మిషన్ పొందాలంటే కనీసం 14 ఏళ్లు, ఇంటర్‌లో చేరాలంటే 15 ఏళ్లు దాటిన వారెవరైనా పాఠశాలల్లో చేరొచ్చు. వయస్సు పరిమితి లేదు. చదవడం, రాయడం వచ్చి ఉండాలి. ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి పాసై ఉండాలి. దరఖాస్తుతో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యాసకులు ఆయా విభాగాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు జత చేయాలి.

తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ, ఒరియా మాధ్యమంలో బోధన ఉంటుంది.

ఇంటర్‌లో..

ఇంటర్మీడియట్‌లో గ్రూపు–ఏలో భాషలు, గ్రూపు–బీలో ఆప్షనల్స్, గ్రూపు–సీలో విద్యా కోర్సులు ఉంటాయి. తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమంలో బోధన ఉంటుంది. అభ్యాసకులు తమకు నచ్చిన భాషను ఎంచుకోవచ్చు. ఓపెన్ స్కూల్ ద్వారా విద్యా పూర్తిచేసిన వారు ఉన్నత విద్య, ఉద్యోగాలకు అర్హులే.

ఫీజుల్లో రాయితీలు

పదో తరగతి అడ్మిషన్ జనరల్‌లో ఓసీలకు ఫీజు రూ.1,400లు ఉండగా, దివ్యాంగులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.1,000, రిజిస్ట్రేషన్ రూ.150 చెల్లించాలి. ఇంటర్ జనరల్ కేటగిరి పురుషులు రూ.1,500, మిగితా కేటగిరీలకు చెందిన వారికి రూ.1,200లు మాత్రమే. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300లు చెల్లించాలి.

ఇప్పటి వరకు 966 అడ్మిషన్లు



ఉమ్మడి జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు టెన్త్, ఇంటర్‌లో ఆన్‌లైన్ ద్వారా 966 మంది అడ్మిషన్లు పొందారు. మెదక్ జిల్లా(153), సంగారెడ్డి (729), సిద్దిపేట (84) చొప్పున అడ్మిషన్లు నమోదయ్యాయి. ఓపెన్ స్కూల్ ద్వారా పాసైతే ఉన్నత విద్య అభ్యసించే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ విద్యతో సమానంగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ వర్తిస్తుంది. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటస్వామి, ఉమ్మడి మెదక్ జిల్లా కో ఆర్డినేటర్

అడ్మిషన్లు ప్రారంభం

ఈనెల 8 నుంచి ప్రవేశాలు ప్రారంభం కాగా సెప్టెంబర్ 10 వరకు కొనసాగనున్నాయి. అక్టోబర్ 31 వరకు అదనపు రుసుముతో అడ్మిషన్లు పొందవచ్చు. ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి రసీదు, అడ్మిషన్ ఫారాన్ని అధ్యయన కేంద్రంలో సమర్పించాలి. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

మెదక్ మున్సిపాలిటీ: తాళం వేసిన ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడి రెండు తులాల బంగారం, 10 తులాల వెండి, నగదుతోపాటు బైక్‌ను ఎత్తుకెళ్లారు. మెదక్ పట్టణ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఇందిరాపురి కాలనీలో నివాసం ఉండే అంగన్‌వాడీ టీచర్ రేఖ గురువారం ఇంటికి తాళం వేసి తల్లిగారిల్లు చిన్నఘణపూర్‌కు వెళ్లింది. రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం చుట్టు పక్కల వారు ఈ విషయాన్ని రేఖకు చెప్పారు. వెంటనే ఆమె వచ్చి చూడగా ఇంట్లోని రెండు తులాల బంగారం, 16 తులాల వెండి, కొంత నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. అలాగే ఇదే కాలనీలోని హన్మంతరెడ్డి, మోహన్‌గౌడ్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. హన్మంత్‌రెడ్డి ఇంట్లో రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఇదే వీధిలో ఉండే సాయి చరణ్ ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌ను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టణ సీఐ నాగరాజు ఘటనా స్థలాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరోడే చోరుడు

- గ్రామంలోనే 10 ఇళ్లలో దొంగతనం
- నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న కరుణాకర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): పది ఇండ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడిన కేసులో ఊరోడే చోరుడు అని పోలీసులు నిర్ధారించారు. శుక్రవారం వర్గల్ మండలం శాకారం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న గౌరారం పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. అంబర్‌పేట గ్రామంలో 9వ తేదీన రాత్రి తాళం వేసి ఉన్న పది ఇళ్లలో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం శాకారం చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తున్న గౌరారం పోలీసులకు అంబర్‌పేటకు చెందిన వల్లపు రాజు అనుమానాస్పదంగా కన్పించాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. అంబర్‌పేటలో 10 ఇళ్లలో దొంగతనాలు, జూలై నెలలో గజ్వేల్ పట్టణంలోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడి నుంచి మోటార్‌సైకిల్, తులం బంగారం 64 తులాల వెండి వస్తువులు, రూ.18,000 నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. నిందితుడు కూలీ పని చేసుకుంటూ జీవించేవాడని తెలిపారు.

అత్యాచారం కేసులో జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి కోర్టు జైలు, జరిమానా విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని గండిగూడెంకు చెందిన ఓ బాలిక(3)ను 2019లో ఇంటి పక్కన నివాసముండే అభయ్ కుమార్(ఉత్తరప్రదేశ్ రాష్ట్రం) లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక అమ్మమ్మ అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వపరాలను పరిశీలించిన స్పెషల్ పోక్సో న్యాయమూర్తి జయంతి నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించడంలో విఫలమైతే ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులకు, అప్పటి సీఐ ప్రభాకర్, ప్రస్తుత సీఐ సదా నాగరాజు, పీ.పీ కృష్ణ, భరోసా లీగల్ సపోర్ట్ పర్సన్ సౌజన్య, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ మహేందర్, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలను ఎస్పీ అభినందించారు.

ముగ్గురు సైబర్ నిందితుల అరెస్ట్

- ట్రేడింగ్ పేరుతో రూ.13 లక్షలు మోసం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: సైబర్ మోసానికి పాల్పడిన ముగ్గురు నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట క్రైమ్ పోలీసు స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్, ప్రగతినగర్ కాలనీకి చెందిన కడవెర్గు రామకృష్ణ, న్యూ నాగోల్‌కు చెందిన గంగాధర అభిషేక్, రంగారెడ్డి జిల్లా మారుతీనగర్‌కు చెందిన జీడిగాం ఉమాకాంత్ బెజ్జంకి గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్‌కు వాట్సాప్‌లో కొద్ది రోజుల కిందట ఓ లింకును పంపారు. ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో వస్తాయని నమ్మించారు. ఆ మాటలు నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.13,12,017 పంపించాడు. తర్వాత నిందితులకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సైబర్ మోసం జరిగినట్లు అనుమానంతో ముగ్గురిపై సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నూతన టెక్నాలజీ సాయంతో ముగ్గురు నిందితులను హైదరాబాద్ హబ్సిగూడ వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి రూ.50 వేలు రికవరీ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

కమీషన్ పేరుతో రూ.17.41 లక్షలు మోసం

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓ వ్యక్తి భారీగా నగదు పోగొట్టుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆగస్టు 2వ తేదీన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. అతడు తన వివరాలను నమోదు చేయగా ఓ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించాడు. అనంతరం పలు దఫాలుగా మొత్తం రూ.17.41 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెండింగ్ కేసులను డిస్పోజల్ చేయాలి

- సిద్దిపేట సీపీ అనురాధ
- పోలీసు అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పెండింగ్ కేసులను వెంటనే డిస్పోజల్ చేయాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై పోలీసు అధికారులతో శుక్రవారం సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓ వ్యక్తిపై షీట్ తెరిచే ముందు అతడి పూర్తి వివరాలు ఇంట్రాగేషన్ రిపోర్టు తీసుకొని షీట్ ఓపెన్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ రోజు సాయంత్రం వాహన తనిఖీ నిర్వహించాలన్నారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా పీస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వినాయక మండపాల ఆర్గనైజర్లతో సంబంధిత ఎస్‌ఐలు సమావేశాలు నిర్వహించాలన్నారు. అనుమానితులు, రౌడీలు, కేడీలను ప్రతి నెలా రివ్యూ చేయాలని ఏసీపీలకు సూచించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, గజ్వేల్ ఏసీపీ రవీందర్, సైబర్ క్రైమ్ పీఎస్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీను, ప్రవీణ్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన్ సేవలు అమోఘం

- డీఈఓ రాధాకృష్ణ, ఇస్రో శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రావు



ఇస్రో ప్రయోగాలపై వివరిస్తున్న శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రావు

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థుల్లో అంతరిక్ష రంగంపై చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ చేస్తున్న కృషి అమోఘమని జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, ఇస్రో శాస్త్రవేత్త డా. శ్రీనివాస్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి కొనియాడారు. శుక్రవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతరిక్షయానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చంద్రయాన్, గగన్‌యాన్, మంగళ్‌యాన్, ఇస్రో రాకెట్ ప్రయోగాల గురించి వివరించారు. అదే విధంగా 'స్పేస్ ఆన్ వీల్స్' కార్యక్రమంలో భాగంగా ఇస్రో బస్సులో ప్రత్యేకంగా రూపొందించిన అంతరిక్ష ప్రయోగాల వివిధ నమూనాలను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. దేశ నిర్మాణం తరగతి గదుల్లోనే మొదలవుతుందని, దానికనుగుణంగా ప్రతిఒక్కరూ ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలన్నారు. అంతరిక్ష పరిశోధనలతో మనం ఎన్నెన్నో విజయాలను సొంతం చేసుకుంటున్నామని, ఆ ప్రయోగాల ఫలితాల వల్లే మన జీవితంలో అనేక ప్రయోజనాలు పొందగలుగుతున్నామని అన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి సైంటిస్టులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ యాదగిరి, పాఠశాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు సద్వినియోగం చేసుకోండి

- డిగ్రీ చదువుతున్న వారు అర్హులు
- సిద్దిపేట లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు

సిద్దిపేటకమాన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అండర్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 17వ తేదీ లోపు ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మొత్తం నాలుగు రౌండ్‌లుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్న విద్యార్థులకు మొదటగా ఆర్‌బీఐ ఆన్‌లైన్‌లో 36 ప్రశ్నలతో పరీక్ష ఉంటుందన్నారు. సైన్స్, ఫైనాన్స్, కరెంట్ అఫైర్స్, బ్యాంకింగ్‌పై ప్రశ్నలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి మొదటి స్థానంలో నిలిచిన వారిని జోనల్ లెవల్‌కు ఎంపిక చేస్తామన్నారు. జోనల్ లెవల్‌లో ప్రతిభ కనబర్చితే జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. జాతీయ, రాష్ట్ర, జోనల్ లెవల్ విజేతలకు రూ.లక్షల్లో నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల 25 ఏళ్లలోపు డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ చేతుల మీదుగా నేడు (శనివారం) ఆవిష్కరించనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు.

మాజీ సర్పంచ్ వేధింపులు తాళలేక..

- గొంతులో పొడుచుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



గాయాలతో రాజాగౌడ్

గజ్వేల్‌రూరల్: మాజీ సర్పంచ్ వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామ సమీపంలోని రాజీవ్ రహదారి పక్కన చోటు చేసుకుంది. కుకునూర్‌పల్లి పోలీసుల కథనం మేరకు.. యాదాద్రి జిల్లా మల్లాపురం గ్రామానికి చెందిన ఎరుకల రాజయ్యగౌడ్(65) శుక్రవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని రాజీవ్ రహదారి పక్కన చాకుతో గొంతుల పొడుచుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రక్తపు మడుగులో పడి ఉన్న రాజాగౌడ్‌ను 108 వాహనంలో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రాజయ్య పలు వివరాలు వెల్లడించడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తమ గ్రామ మాజీ సర్పంచ్ ఇబ్బందులకు గురిచేస్తూ చంపుతానని బెదిరించాడని, తుర్కపల్లి మండలం మాదాపురంలో తమ కొడుకు ఇంట్లో శుభకార్యం ఉండటంతో ఇక్కడకు వచ్చానని, అయినప్పటికీ తాను తీవ్ర మనోవేదనకు గురై ఆటోలో కొడకండ్లకు వచ్చానని పేర్కొన్నాడు. గ్రామ మాజీ సర్పంచ్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు ఇబ్బందులు పెడుతున్నారని వీడియోలో వాపోయాడు. ఆత్మాహత్యాయత్నానికి గల కారణాలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుక్కను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు

- ముగ్గురు ఉపాధ్యాయులకు గాయాలు



కొండపాక(గజ్వేల్): ప్రమాదంలో దెబ్బతిన్న కారు



బెజ్జంకి(సిద్దిపేట) : చెట్ల పొదల్లో లారీ

కొండపాక(గజ్వేల్): అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి శివారులో రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేటకు చెందిన ఉపాధ్యాయులు మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, చైతన్య కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం కారులో ముగ్గురూ పాఠశాలకు వెళ్తున్నారు. కుకునూర్‌పల్లి వచ్చే ముందు మలుపు వద్ద కుక్క అడ్డం రావడంతో తప్పించే ప్రయత్నంలో కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. అనంతరం రోడ్డుపైకి దూసుకొచ్చి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా, మల్లారెడ్డి, చైతన్యకు స్వల్ప గాయాల య్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది మహేందర్, రమేశ్ క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

పటాన్‌చెరుటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఓఆర్‌ఆర్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో గురువారం రాత్రి రామేశ్వరంబండ గ్రామం వైపు నుంచి ఇంద్రేశం వైపు ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర రక్త గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ స్టేజీ సమీపంలో గల రాజీవ్ రహదారిపైన శుక్రవారం హైద్రాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది.ఈ సమయంలో వాహనాలు ఏవీ రోడ్డుపై లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు సమాచారమివ్వగా పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



కిషన్ యాదవ్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): బొలేరో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందగా, మరొకరు గాయాలపాలయ్యారు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. వర్గల్ మండలం మీనాజీపేటకు చెందిన గొల్ల కిషన్‌యాదవ్ (37)కు భార్య మమత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బొలేరో వాహనం నడుపుతుంటాడు. గురువారం ఇంట్లో విద్యుత్ సమస్య తలెత్తడంతో తున్కిమక్తకు చెందిన ఎలక్ట్రీషియన్ ఎల్కంటి రాజుతో కలిసి విద్యుత్ సామగ్రి తెచ్చేందుకు బొలేరో వాహనంలో మేడ్చల్‌కు బయల్దేరారు. మీనాజీపేట శివారులో మలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే కిషన్‌యాదవ్ మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. శుక్రవారం మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.